# నత్తనడకన 'జల విద్యుత్తు' మరమ్మతు!

- శ్రీశైలం ఎడమగట్టు యూనిట్-4కు మోక్షమెన్నడో..?
- మరమ్మతుల్లో తీవ్రజాప్యం
- వరదవచ్చే నాటికి సిద్ధమయ్యేనా..?
- పట్టించుకోని జెన్కో యాజమాన్యం
- మంత్రులు, ప్రజాప్రతినిధులు విజిట్‌చేసినా పురోగతి నిల్



నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట వద్ద ఉన్న శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రం

దోమలపెంట, మే 22 : తెలంగాణ-ఏపీ సరిహద్దులోని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్తు కేంద్రం యూనిట్-4 పనులు నత్తనడకన సాగుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలోని జలవిద్యుత్తు కేంద్రంలో 6 యూనిట్లు ఉన్నాయి. ఇందులో ఒక్కో యూనిట్‌లో 150 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుదుత్పత్తి కొనసాగిస్తున్నారు. 2020 ఆగస్టు 20న యూనిట్‌లో బ్యాటరీలు మారుస్తుండగా.. షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. నైట్ డ్యూటీలో ఉన్న ఐదుగురు ఇంజినీర్లు, ఇద్దరు ప్లాంట్ అసిస్టెంట్లు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు అమరరాజా బ్యాటరీ కంపెనీ ఉద్యోగులు కేంద్రాన్ని రక్షించాలని చివరి వరకు ప్రయత్నించి ప్రాణాలు వదిలారు. ఈ ఘటనలో 4వ యూనిట్ పూర్తిగా దగ్ధమవగా.. మిగతా యూనిట్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. దీంతో రూ.100 కోట్ల నష్టం సంభవించింది. ప్రమాదం తర్వాత మరమ్మతులు చేయడం కోసం ఒక ప్రముఖ కంపెనీకి కాంట్రాక్ట్ ఇవ్వగా.. యూనిట్ సిద్ధం చేసిన కొద్ది రోజులకే మళ్లీ అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. దీంతో మళ్లీ మరమ్మతులు చేపట్టగా.. పనుల్లో జాప్యం జరుగుతున్నది.

**బ్లాక్ లిస్టులో పెట్టిన కంపెనీకే మరోసారి పనులు**

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన నాలుగో యూనిట్ మరమ్మతులు చేపట్టేందుకు ఢిల్లీకి చెందిన వాయిత్ కంపెనీ రూ.14,93,41,271కు టెండర్ దక్కించుకున్నది. 2021 సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించి, 2023 జూలై చివరి నాటికి పనులు పూర్తి చేసి జెన్‌కోకు అప్పగించింది. 2023 జూలై 17న ఈ యూనిట్‌ను రన్ చేసి, గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. 19 రోజుల్లో 72 గంటల వ్యవధిలో 11.6929 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేశారు. 2023 ఆగస్టు 17న స్టేటర్ వైండింగ్ బార్స్‌లో షార్ట్‌సర్క్యూట్ కావడంతో మరోసారి మంటలు చెలరేగాయి. సదరు కాంట్రాక్ట్ సంస్థ, జెన్కో సక్రమంగా రన్ చేయకపోవడంతోనే షార్ట్‌సర్క్యూట్ అయ్యిందని తప్పించుకునే ప్రయత్నం చేసింది. జెన్‌కో యాజమన్యం నిపుణుల కమిటీతో విచారణ చేయించగా.. మరమ్మతులలో నాసిరకం మెటీరియల్ వాడటంవల్లే ఈ ప్రమాదం జరిగిందని నివేదిక ఇచ్చింది. దీంతో వాయిత్ కంపెనీ కాంట్రాక్ట్ లైసెన్స్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టినట్టు జెన్‌కో మాజమాన్యం ప్రకటించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నాలుగో యూనిట్ మరమ్మతులను పూర్తి చేసి ఈ ఏడాది వానకాలం సీజన్ నాటికి యూనిట్‌ను సిద్ధం చేయాలని ఆదేశించింది. బ్లాక్ లిస్ట్‌లో చేర్చిన వాయిత్ కంపెనీకే తిరిగి పనులు అప్పగించింది.

**ఎట్టకేలకు పనులు ప్రారంభం**

ఏడాదిన్నర కిందట కాలిపోయిన 4వ యూనిట్‌కు మరమ్మతులు పూర్తిచేసి, అప్పగించాలని వాయిత్ కంపెనీతో అగ్రిమెంట్ ఉన్నది. ఈ విషయమై జెన్‌కో యాజమాన్యం కంపెనీపై ఒత్తిడి తీసుకురాగా.. తమకు అదనంగా నిధులు కేటాయిస్తే తప్ప పనులు చేయమని తెగేసి చెప్పడంతో చేసేది లేక మరో రూ.1.30 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించినట్టు సమాచారం. దీంతో 20 రోజుల కిందట 4వ యూనిట్‌లో మరమ్మతు పనులు ప్రారంభం కాగా నత్తనడకన సాగుతున్నాయి.

**మంత్రులు విజిట్ చేసినా సాగని వైనం**

ఏడాది కిందట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎమ్మెల్యేలు కలిసి భూగర్భ జల విద్యుత్తు కేంద్రాన్ని సందర్శించారు. 4వ యూనిట్‌ను పరిశీలించి జెన్‌కో యాజమాన్యంతో సమీక్ష నిర్వహించారు. గతేడాది జరగాల్సిన పనులు, జెన్‌కో యాజమాన్యం, వాయిత్ కంపెనీకి మధ్య కొన్ని ఇబ్బందులు రావడంతో పనులు ఆలస్యం అయ్యాయి. తర్వాత ఇద్దరి మధ్య సయోధ్య కుదరడంతో మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆదేశించినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రూ.వెయ్యి కోట్ల నష్టం**

2020 లో జరిగిన అగ్ని ప్రమాదంతో 4వ యూనిట్ పూర్తిగా కాలిపోగా.. నాలుగేండ్లుగా విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. ఒక్క యూనిట్‌లో 24 గంటల ఉత్పత్తి కొనసాగితే రోజుకు 36 లక్షల యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. నాలుగేళ్లుగా 172.80 కోట్ల యూనిట్ల ఉత్పత్తి నిలిచిపోయినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం ప్రైవేటు రంగ విద్యుత్ సంస్థలతో విద్యుత్ కొనుగోలు చేసేందుకు యూనిట్‌కు రూ.5 వరకు చెల్లిస్తున్నది. ఈ విధంగా లెక్కిస్తే రూ.864 కోట్ల నష్టం వాటిల్లినట్టు చెప్పొచ్చు. 4వ యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి జరిగి ఉంటే ప్రభుత్వపరంగా పేదలకు ఉచితంగా ఇస్తున్న పథకానికి ఇబ్బంది ఉండేది కాదని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. 4వ యూనిట్‌కు సంబంధించిన ఇంజినీర్‌ను వివరణ కోరగా.. మరమ్మతులు ఆలస్యమవడం వాస్తవమే అన్నారు. గత నెల 30న పనులు ప్రారంభించామని, మరో మూడు నెలల్లో యూనిట్‌ను సిద్ధం చేస్తామని తెలిపారు.

## ఖండాంతర క్షిపణిని పరీక్షించిన అమెరికా



కాలిఫోర్నియా: అమెరికా ఈ నెల 21న నిర్వహించిన అన్‌ఆర్మ్‌డ్ మినిట్‌మన్-3 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి (ఐసీబీఎం) ప్రయోగం విజయవంతమైంది. ఇది అణ్వాయుధ సామర్థ్యం కలది. దీనిని కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి ప్రయోగించింది. అమెరికా వ్యూహాత్మక రక్షణ వ్యవస్థలో ఇది కీలక ఘట్టం. ఈ క్షిపణికి మార్క్-21 రీఎంట్రీ వెహికిల్‌ను అమర్చారు. ఈ క్షిపణి 4,200 మైళ్ల దూరంలోని రిపబ్లిక్ ఆఫ్ ది మార్షల్ ఐలండ్స్‌లో ఉన్న క్వాజాలీన్ అటోల్‌పై ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని ఛేదించింది. మినిట్‌మాన్-3 పరిధి దాదాపు 13,000 కిలో మీటర్లు. ఇది ఖండాలను దాటుకుని లక్ష్యాన్ని ఛేదించగలదు. దీని పొడవు 18 మీటర్లు, వ్యాసం 1.85 మీటర్లు, బరువు 34,000 కేజీలు. అణ్వాయుధ దాడులను నిరోధించే సత్తా దీనికి ఉంది.

## తెలంగాణకు 10.26 టీఎంసీలు.. ఏపీకి 4టీఎంసీలు..

### కేఆర్‌ఎంబీ నీటివిడుదల ఉత్తర్వులు..

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల నుంచి తాగునీటి అవసరాల కోసం తెలంగాణకు 10.26 టీఎంసీలు, ఏపీకి 4టీఎంసీలను విడుదల చేయాలని కేఆర్‌ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) నిర్ణయించింది. ఈ మేరకు గురువారం నీటి విడుదల ఉత్తర్వులు జారీచేసింది. జూన్ 31 వరకు తాగునీటి అవసరాలపై ఇరు రాష్ట్రాలు ఇటీవల బోర్డుకు ప్రతిపాదనలు పంపాయి. నీటి కేటాయింపులపై త్రిసభ్య కమిటీ సమావేశాన్ని సైతం నిర్వహించాయి. పది టీఎంసీల చొప్పున విడుదల చేయాలని తెలంగాణ, ఏపీ కూడా కోరాయి. ఇదిలా ఉంటే శ్రీశైలం, సాగర్‌లో కలిపి మొత్తంగా 21.21టీఎంసీల జలాలు వినియోగానికి అందుబాటులో ఉన్నాయని, అందులో రవాణా, నీటి ఆవిరి నష్టాలు 4.24 టీఎంసీలు ఉంటాయని, నికరంగా 16.97టీఎంసీలే మిగులుతాయని బోర్డు తేల్చింది. అందులో 10.26 టీఎంసీలను తెలంగాణకు, నాలుగు టీఎంసీలను ఏపీకి తాగునీటి అవసరాలకు విడుదల చేయాలని నిర్ణయించి ఆ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. ఎన్‌ఎస్‌పీ రైట్ కెనాల్ ద్వారా రోజుకు 5500 క్యూసెక్కుల చొప్పున ఏపీకి విడుదల చేయాలని సూచించింది. అదేవిధంగా నీటి విడుదల కోసం సంబంధిత అధికారులను డ్యామ్‌ల మీదకు అనుమతించాలని సీఆర్పీఎఫ్ భద్రతా బలగాలకు ఉత్తర్వులు జారీ చేసింది.

## ఏఐతో 'నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్' వ్యాధి స్క్రీనింగ్

### సర్కారుకు ప్రతిపాదనలు పంపిన వైద్యారోగ్య శాఖ

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధస్సు(ఏఐ) సేవలను విస్తృతంగా వాడుకోవాలని వైద్యారోగ్య శాఖ భావిస్తున్నది. ఇప్పటికే క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం ఏఐ ఆధారిత సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించిన వైద్యారోగ్యశాఖ తాజాగా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి (ఎన్‌ఏఎఫ్‌ఎల్డీ) స్క్రీనింగ్‌కు కూడా ఏఐను వినియోగించుకోవాలని భావిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఏఐ ఆధారిత సాధనాల ద్వారా కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని గుర్తించి, దాని తీవ్రతను అంచనా వేసి, వ్యాధి ప్రారంభ దశలను కనుగొననున్నారు. ఏఐ టూల్‌తో రక్త పరీక్షలు, ఇమేజింగ్ టెస్టులు, ఇతర వైద్య సమాచారాన్ని విశ్లేషించనున్నారు. ఈ స్కాన్‌లో నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి లక్షణాలను గుర్తించి నిపుణులైన వైద్యులకు రిఫర్ చేయనున్నారు. డాక్టర్లు రిపోర్టులను అధ్యయనం చేసి వ్యాధిని నిర్ధారణ చేయనున్నారు. 'నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్' వ్యాధి స్క్రీనింగ్ ప్రతిపాదిత ఫైల్‌ను ప్రస్తుతం వైద్యశాఖ అధికారులు ప్రభుత్వానికి పంపారు. అక్కడి నుంచి ఆమోదం రాగానే ఎన్ని జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టులు చేపట్టాలనే అంశంపై తుది నిర్ణయం తీసుకుంటామని సంబంధిత శాఖ వర్గాలు తెలిపాయి.

**నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి అంటే..**

మద్యం తాగకపోయినా కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి(ఎన్‌ఏఎఫ్‌ఎల్డీ) అంటారు.కాలేయ బరువు సాధారణం కంటే 5 నుంచి 10శాతం ఎక్కువ కొవ్వుతో తయారైతే దాన్ని ఫ్యాటీ లివర్ (స్టీటోసిస్) అంటారు. మారుతున్న జీవనశైలితోపాటు జన్యు సిద్ధత (ఇన్సులిన్ రెసిస్టెన్స్) కారణంగా కాలేయంలో కొవ్వు పెరుగుతుంది. ఈ సమస్యను సకాలంలో పరిష్కరించకపోతే అది కాలేయానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. టైప్-2 డయాబెటిస్, అధిక రక్తపోటు, అధిక బరువు లేదా మెటబాలిక్ సిండ్రోమ్ ఉన్న వారికి దీని కారణంగా హై రిస్క్ ఉంటుంది.

## జూరాలకు పదివేల క్యూసెక్కుల వరద

అయిజ/రాజోళి/అమరచింత, మే 22 : కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న అకాల వర్షాలకు డ్యాంలోకి వరద ప్రవాహం చేరుతున్నది. గురువారం డ్యాంలోకి 8,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. నీటి మట్టం 1588.80 అడుగులు ఉండగా, 10.058 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. ఆర్డీఎస్ ఆనకట్టకు 18 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, వచ్చిన నీరు వచ్చినట్టే దిగువన ఉన్న సుంకేసుల బరాజ్‌కు చేరుతున్నది. సుంకేసులకు 17,648 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా నాలుగు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. అదేవిధంగా జూరాల ప్రాజెక్టుకు ఎగువన కురుస్తున్న వర్షాలకు భారీగా వరదనీరు చేరుతున్నది. గురువారం సాయంత్రం వరకు దాదాపు పదివేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

## 29నుంచి గ్రూప్-2 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

### టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోల్లస్ వెల్లడి

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): గ్రూప్-2 పోస్టుల భర్తీ కోసం ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. 783పోస్టుల భర్తీకిగాను ప్రభుత్వం డిసెంబర్ 29, 2022న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విధితమే. ఈ క్రమంలో ఈనెల 29నుంచి జూన్ 10వరకు ఉదయం 10.30గం.ల నుంచి మధ్యాహ్నం 1.30వరకు.. ఆ తర్వాత 2.00నుంచి సాయంత్రం 5.30వరకు నాంపల్లి పబ్లిక్‌గార్డెన్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి యూనివర్సిటీలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోల్లస్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 11న రిజర్వుడే ఉంటుందని, ఆరోజు ఉదయం 10.30నుంచి సాయంత్రం 5.30గం.ల వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని చెప్పారు. పోస్టుల కోసం షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థుల వివరాలు కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్టు, పరిశీలనకు వచ్చేవారు తీసుకొచ్చే సర్టిఫికెట్ల వివరాలు ఈనెల 26నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు, ఒక సెట్ జిరాక్స్ కాపీని కూడా తీసుకురావాలని సూచించారు. ఈనెల 27నుంచి జూన్ 11వరకు వెబ్ ఆప్షన్స్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, అభ్యర్థులు ఎంపిక చేసుకోవాలని కోరారు. ఎంపిక చేసుకున్న తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలనకు రానివారికి మరో అవకాశం ఉండదని, ఒకవేళ అభ్యర్థులు తక్కువైతే అందుకను గుణంగా అభ్యర్థులను పిలుస్తామని కార్యదర్శి స్పష్టంచేశారు.

## బ్యాగ్‌లాగ్ సీట్ల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): బీసీ గురుకులాల్లో 6,7,8,9 తరగతులు కలిపి 6,832 బ్యాగ్ లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి సైదులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశపరీక్షలో మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించినట్టు వెల్లడించారు. ఫలితాలను www.mjptbcwreis.telangana.gov.in, https://mjptbcadmissions.org వెబ్‌సైట్‌లో చూసుకోవాలని తెలిపారు. 24న కౌన్సెలింగ్ ఉంటుందని, ఎంపికైన విద్యార్థులు తమ ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే కుట్ర

### ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రంలోని 12సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో వందలాది మంది పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్, జేఈఈ, ఎప్‌సెట్ ఫలితాల్లో గురుకుల ఇంటర్ విద్యార్థులు ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలతో పోటీపడి ర్యాంకులు సాధించారని గుర్తుచేశారు. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టలేని ప్రభుత్వం.. ఎస్సీ గురుకుల ఇంటర్ కళాశాలలను మూసి వేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. గురుకుల కళాశాలలు పేద విద్యార్థులకు ఎంతో బాసటగా నిలుస్తున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం కళాశాలల ఎత్తివేత నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.














